సాక్షి
చిత్తూరు
గురువారం, 3, ఆగస్టు, 2023



ప్రగతి పరుగులు

తిరుపతి జిల్లా సత్యవేడులోని శ్రీసిటీ రెండో దశ అభివృద్ధి పనుల్లో పారిశ్రామిక ప్రగతి పరుగులు తీస్తోంది. - 8లో



దివ్యాంగులకు ఆత్మస్థైర్యం అవసరం

చిత్తూరు కణ్ణన్ పాఠశాలలో జిల్లా స్థాయి దివ్యాంగుల క్రీడా పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులందజేశారు. - 8లో

	గరిష్ఠం	కనిష్ఠం
చిత్తూరు	36	25
తిరుపతి	36	26
తిరుమల	32	22
గూడూరు	38	28
నగరి	38	27

న్యూస్‌రీల్

ప్లానింగ్ కో ఆర్డినేటర్‌గా జయప్రకాష్



ఉత్తర్వులు అందుకుంటున్న జయప్రకాష్

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా సమగ్ర శిక్ష శాఖ ప్లానింగ్ కో ఆర్డినేటర్‌గా జయప్రకాష్ నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం జిల్లా సమగ్ర శిక్ష శాఖ అడిషనల్ ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ పెద్దిరెడ్డి వెంకటరమణారెడ్డి నియామక ఉత్తర్వులు అందజేశారు. నియమితులైన జయప్రకాష్ విలేకరులతో మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాలను ఎప్పటికప్పుడు అనుసరిస్తూ, విధులను సమర్థవంతంగా నిర్వర్తిస్తామని తెలిపారు.

మిషన్ ఇంద్రధనస్సులో నిర్లక్ష్యం వద్దు

చిత్తూరు రూరల్: మిషన్ ఇంద్రధనస్సు లక్ష్య సాధనలో నిర్లక్ష్యం వద్దని డీఎంహెచ్ఓ ప్రభావతిదేవి సూచించారు. నగరంలోని తన కార్యాలయంలో బుధవారం మిషన్ ఇంద్ర ధనస్సు కార్యక్రమంలో టాస్క్‌ఫోర్సు కమిటీ సమావేశం నిర్వహించారు. అందులో డీఎంహెచ్‌వో మాట్లాడుతూ పిల్లలకు అందించే టీకా అమలు వంద శాతం పూర్తికావాలన్నారు. ఈ ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం మిషన్ ఇంద్ర ధనస్సు కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. గర్భిణులు, చిన్నపిల్లలకు ఇవ్వాల్సిన టీకాలను గుర్తించి యూవిన్ యాప్‌లో నమోదు చేయాలన్నారు. గుర్తించిన వారిని ఈనెల 7వతేదీ నుంచి జరిగే కార్యక్రమంలో విధిగా టీకాలు వేయించాలన్నారు. కార్యక్రమంలో డీఐఓ రవిరాజు, జిల్లా క్షయ నివారణ అధికారి వెంకటప్రసాద్, డీపీఎంఓ హర్షవర్ధన్, ఆర్‌బీఎస్‌కే కో-ఆర్డినేటర్ సుదర్శన్, అధికారులు సందీప్, శిరీష, శ్రీనివాసులు, రేణుక ప్రభ, గుణశేఖర్ పాల్గొన్నారు.

జిప్సంతో అధిక దిగుబడి



వేరుశనగ పంటను పరిశీలిస్తున్న మురళీకృష్ణ

చిత్తూరు రూరల్: వేరుశనగ పంట సాగులో సూచనలు, సలహాలు పాటిస్తూ, అధిక దిగుబడి సాధించాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి మురళీకృష్ణ సూచించారు. చిత్తూరు మండలం చెర్లోపల్లిలో బుధవారం పొలంబడి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామ ఆవరణలో సాగవుతున్న వేరు శనగ పంటను ఆయన పరిశీలించారు. ప్రయోగాత్మకంగా కలుపు నివారణ, జిప్సంవాడకం తదితర అంశాలపై సూచనలు చేశారు. ఆయన మాట్లాడుతూ పంట ఎదుగుదలలో జిప్సం వాడితే ఆశించిన స్థాయిలో ఫలితాలు ఉంటాయని, ఎకరాకు 200 కిలోలు అవసరమవుతుందన్నారు. జిప్సంను ప్రభుత్వం ఆర్బీకేల ద్వారానే అందిస్తోందని చెప్పారు. అనంతరం చెర్లోపల్లి, తుమ్మింద ఆర్బీకేలను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏడీ మధుసూదన్ రెడ్డి, ఏఓ వేణుగోపాల్, సిబ్బంది ప్రియ, మోహన్, చైత్ర తదితరులు పాల్గొన్నారు.

వరసిద్ధుని సేవలో ప్రిన్సిపల్ సెక్రటరీ



ప్రిన్సిపల్ సెక్రటరీకి చిత్రపటం అందిస్తున్న ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు

కాణిపాకం(యాదమరి): కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామిని రాష్ట్ర దేవదాయ ధర్మాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కరికల్ వలవెన్ దర్శించుకున్నారు. బుధవారం ఉదయం ఆయన కాణిపాకం విచ్చేయగా పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు, ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు స్వాగతం పలికి స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించారు. అనంతరం ఆశీర్వాద మండపంలో స్వామివారి చిత్రపటం తీర్థ ప్రసాదాలు అందించారు. అనంతరం దేవస్థానంలో జరుగు అభివృద్ధి పనుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. వచ్చే నెలలో స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలకు ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టారని ఆరా తీశారు. ఆలయ సమీపంలోని బెంగళూరు-విజయవాడ జాతీయ రహదారి పక్కన ఆలయానికి 18.6 ఎకరాల ప్రభుత్వ భూమిని స్థానిక కలెక్టర్ అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ శాంతిసాగర్ రెడ్డి, దేవాదాయ శాఖ ఏసీ ఏకాంబరం, ఆలయ ఏఈఓలు ఎస్వీ కృష్ణారెడ్డి, విద్యాసాగర్ రెడ్డి, సూపరింటెండెంట్ రంగస్వామి పాల్గొన్నారు.

సంపూర్ణ బలం

ప్రభుత్వం 'అమ్మ'కు సంపూర్ణ పోషకాహారాన్ని అందిస్తూ అండగా నిలుస్తోంది. వారిలో రక్తహీనతకు చెక్ పెడుతూ అవసరమైన అన్ని చర్యలు చేపట్టింది. అయితే గర్భిణులు, బాలింతలు రోజూ అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చి పోవడానికి ఇబ్బందులు పడుతున్నట్లు గుర్తించింది. అందుకే వారికి సంపూర్ణ పౌష్టికాహారాన్ని ఇంటికే అందించాలని సంకల్పించింది. 10 రకాల సరుకులను ప్రత్యేక సంచిలో వేసి ఆ కిట్‌ను నెలకు రెండు సార్లు ఇంటికే అందించే బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది.

- అంగన్‌వాడీల బలోపేతానికి సర్కారు కృషి
- పండుగలా వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్‌ల పంపిణీ
- హాజరైన జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు



సంపూర్ణ పోషణ కిట్లను అందజేస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

చిత్తూరు కలెక్టరేట్ : అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు రాష్ట్ర ప్రభుత్వం సంపూర్ణ పౌష్టికాహారం అందిస్తోందని జెడ్పీ చైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. బుధవారం వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్ల పంపిణీ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి క్యాంపు కార్యాలయం నుంచి రాష్ట్ర స్థాయి కార్యక్రమం ప్రారంభించారు. కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి కార్యక్రమం నిర్వహించారు. అతిథులుగా హాజరైన జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు మాట్లాడుతూ విద్య, వైద్యానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తోందని చెప్పారు. గర్భిణులు, బాలింతలకు, చిన్నపిల్లల ఆరోగ్యం కోసం మంచి పౌష్టిక విలువలున్న ఆహారం ను ప్రభుత్వం అందజేస్తోందన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతానికి సర్కారు చర్యలు చేపట్టిందన్నారు. వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకాన్ని పకడ్బందీగా అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం అందజేస్తున్న పోషణ కిట్లతో గర్భిణులు, బాలింతలు రక్తహీనతను అధిగమించి ఆరోగ్యవంతులుగా ఉంటున్నారని చెప్పారు. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్లి భోజనం చేయడం వల్ల ఇబ్బందులను గుర్తించిన సీఎం ఇకపై ఇంటికే పౌష్టికాహారం కిట్‌ను అందజేసేందుకు చర్యలు చేపట్టారన్నారు. క్రమం తప్పకుండా పౌష్టికాహారం పంపిణీ, ఆరోగ్య పరీక్షల వల్ల అంగన్‌వాడీ లబ్ధిదారుల్లో గణనీయమైన వృద్ధి కనిపిస్తోందని చెప్పారను. మేయర్ అముద మాట్లాడుతూ టీడీపీ పాలనలో చిన్నారులకు కోడిగుడ్లు కూడా సక్రమంగా అందేవి కావని గుర్తుచేశారు. అప్పటి టీడీపీ విధానాలకు వైఎస్సార్ సీపీ సర్కారు చెక్ పెట్టి, పారదర్శకమైన విధానాలను అందుబాటులోకి తీసుకొచ్చిందని చెప్పారు. జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రభుత్వం మంచి ఉద్దేశంతో అమలు చేస్తున్న పోషణ పథకాన్ని సక్రమంగా వినియోగించుకోవాలన్నారు. జిల్లాలో 2420 అంగన్‌వాడీ కేంద్రాల్లో 7 నెలల నుంచి మూడేళ్లలోపు 59,034 మంది పిల్లలు ఉన్నారని చెప్పారు. 12,466 మంది గర్భిణులు, 11,340 మంది బాలింతలకు నెలకు రెండు విడతలుగా 10 రకాల వస్తువులతో కలిగిన వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్ అందజేయనున్నట్లు తెలిపారు. ఈ పథకాన్ని గర్భవతులు, బాలింతలు తప్పకుండా ఉపయోగించుకోవాలన్నారు. అనంతరం లబ్ధిదారులకు పౌష్టికాహార కిట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ రమ్య, జెడ్పీ స్టాండింగ్ కమిటీ చైర్‌పర్సన్ భారతి, ఐసీడీఎస్ పీడీ నాగశైలజ, సీడీపీవోలు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

జగనన్న మేలు మరువలేం



ప్రభుత్వం అందజేస్తున్న ఈ సంపూర్ణ పోషణ కిట్లు ఎంతో ఉపయోగపడతాయి. ఇంటి వద్దకే కిట్ల పంపిణీ సంతోషకరం. గర్భందాల్చిన వెంటనే సమీపంలోని అంగన్‌వాడీ కేంద్రంలో పేరు నమోదు చేసుకున్నాను. నా ఆరోగ్య పరిస్థితులను ఆరా తీసి ఎప్పటికప్పుడు సూచనలిస్తున్నారు. జగనన్న చేస్తున్న మేలును మరువలేం.

– గాయత్రి, గర్భిణి, చిత్తూరు

ఆడపడుచులకు అండగా..



ఆడపడచులకు మా జగనన్న అండగా ఉంటున్నారు. ప్రభుత్వం నుంచి అందజేస్తున్న పౌష్టికాహారం చాలా బాగుంది. ప్రస్తుతం కిట్ల రూపంలో పౌష్టికాహారం ఇవ్వాలనే నిర్ణయం హర్షణీయం. ఈ పౌష్టికారం వల్ల రక్తహీనత సమస్య తగ్గింది. సరుకులు ఇంటికే అందించడం గొప్ప విషయం.

– శరణ్య, గర్భిణి, చిత్తూరు

14న యాదవ ఆత్మీయ సభ



మాట్లాడుతున్న మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

పుంగనూరు: యాదవ ఆత్మీయ సభను ఈనెల 14న నిర్వహించనున్నట్లు రాష్ట్ర మంత్రి కారుమూరి నాగేశ్వరరావు తెలిపారు. పట్టణానికి వచ్చిన మంత్రికి బుధవారం స్థానిక శ్రీకృష్ణాలయం వద్ద యాదవ సంఘ నాయకులు వెంకటరెడ్డి యాదవ్, సుబ్రమణ్య యాదవ్ ఘన స్వాగతం పలికారు. వెంకటరెడ్డి యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన యాదవుల సమావేశంలో మంత్రి పాల్గొని యాదవులతో ముఖాముఖి నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కాగానే బీసీలకు ప్రాధాన్యత లభించిందన్నారు. రాష్ట్రంలో ఏ ప్రభుత్వమూ బీసీలను గుర్తించలేదని చెప్పారు. బీసీలను, అందులో ముఖ్యంగా యాదవులకు తగిన గుర్తింపు ఇచ్చిన ముఖ్యమంత్రికి రుణపడి ఉన్నామని స్పష్టం చేశారు. పుంగనూరు నియోజకవర్గంలో మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ పెద్దిరెడ్డి వెంకటమిథున్‌రెడ్డి యాదవులకు అగ్ర స్థానం కల్పించి, వారి అభివృద్ధికి తోడ్పడుతున్నారని కొనియాడారు. వీటిని దృష్టిలో ఉంచుకుని కృతజ్ఞత పూర్వకంగా యాదవ ఆత్మీయ సభను పుంగనూరులో 14న ఘనంగా నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఇందులో రాయలసీమ వాసులకు కోస్తా వంటల రుచి చూపించేందుకు అక్కడి నుంచి వంట వారిని పిలిపించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఈ సమావేశానికి యాదవులందరూ తరలిరావాలని పిలుపునిచ్చారు. పుంగనూరులో యాదవులు నిర్మించిన శ్రీకృష్ణాలయానికి మంత్రి కారుమూరి నాగేశ్వరరావు రూ.5 లక్షలు విరాళం ప్రకటించారు. ఎంపీలు బీదమస్తాన్‌రావు ద్వారా రూ.10 లక్షలు, కృష్ణయ్య ద్వారా రూ.5 లక్షలు విరాళం ఇప్పిస్తున్నట్లు మంత్రి ప్రకటించారు. ఈ సమావేశంలో నరసింహయాదవ్, నరసింహులు, చంద్రారెడ్డి యాదవ్, రెడ్డెప్పరెడ్డి యాదవ్, గంగులమ్మ, గౌరమ్మ పాల్గొన్నారు.

తిరుమల ప్రసాదాలకు ప్రకృతి బెల్లం



లారీని జెండా ఊపి సాగనంపుతున్న డీపీఎం వాసు తదితరులు

శ్రీరంగరాజపురం : ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన 9 టన్నుల బెల్లం తిరుమలలో ప్రసాదాల తయారీ కోసం తీసుకెళుతున్న లారీని ప్రకృతి వ్యవసాయాధికారి(డీపీఎం) వాసు, జెడ్పీటీసీ రమణప్రసాద్‌రెడ్డి జెండీ ఊపి సాగనంపారు. వాసు మాట్లాడుతూ మండల పరిధిలోని మంగుంట గ్రామంలో రైతులు శేషాద్రి, జయచంద్ర, సుబ్రమణ్యంరెడ్డి మూడేళ్లుగా ప్రకృతి వ్యవసాయం చేస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రకృతి వ్యవసాయ విధానం ద్వారా భావితరాలకు ఆరోగ్యకరమైన ఆహారం, సహజమైన నేల, కాలుష్య రహిత పర్యావరణాన్ని అందించవచ్చని తెలిపారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు సాధించడానికి ఏపీ సీఎస్ఎఫ్ బృందం కషి చేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు, ఆర్‌బీకే సిబ్బంది పాల్గొన్నారు.

తమిళ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు



విద్యార్థులకు తమిళ పాఠ్యపుస్తకాలు అందిస్తున్న మంత్రి ఆర్‌కే రోజా

నగరి: విద్యార్థులకు తనవంతు సహకారం ఎప్పుడూ ఉంటుందని రాష్ట్ర పర్యాటక శాఖా మంత్రి ఆర్కేరోజా అన్నారు. స్థానిక చింతలపట్టెడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం తమిళ పాఠ్యపుస్తకాల పంపిణీ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ ప్రస్తుత ప్రభుత్వం విద్యకు ఎంత ప్రాధాన్యత ఇస్తుందో ప్రతి ఒక్కరికీ తెలుసన్నారు. కార్పొరేట్ స్థాయికి మారిన ప్రభుత్వ పాఠశాలలే అందుకు సాక్ష్యమని చెప్పారు. విద్యకు సంబంధిత ప్రతి అంశంపైనా ముఖ్యమంత్రి అత్యంత వేగంగా స్పందిస్తారని పేర్కొన్నారు. స్థానికంగా ఉన్న విద్యార్థులకు తమిళపాఠ్యపుస్తకాలు అందించే విషయంలో తమిళనాడు ముఖ్యమంత్రులు కూడా తనకు సహకారం అందిస్తున్నారని తెలిపారు. తమిళ మాధ్యమం కలిగిన పిల్లలకు తమిళనాడు నుంచి తెప్పించిన పాఠ్య పుస్తకాలను అందజేశారు. నియోజకవర్గంలోని సెంగుందర్ ఇంటి కోడలినని వారిపట్ల తనకు ప్రత్యేక అభిమానము ఉందని చెప్పారు. గతంలో టీడీపీ ప్రభుత్వంలో తమిళ విద్యార్థులకు పుస్తకాలు అందేవి కావని వారు సీడీలు మాత్రమే ఇచ్చేవారని వాటిని తెచ్చి ఇక్కడ ముద్రించుకొని విద్యార్థులకు అందించేలోపు పుణ్యకాలం గడిచిపోయేదని గుర్తుచేశారు. ప్రస్తుతం విద్యార్థులకు ఆ సమస్య లేకుండా చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో తమిళ పాఠశాలలకు చెందిన ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బీఎల్‌ఏలను వెంటనే నియమించండి



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు

చిత్తూరు కలెక్టరేట్ : గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు త్వరితగతిన బూత్‌లెవల్ ఏజెంట్లను నియమించి ఆ జాబితాను వెంటనే కలెక్టరేట్‌కు పంపాలని జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు సూచించారు. కలెక్టరేట్‌లో ఆయన బుధవారం రాజకీయ పార్టీల ప్రతినిధులు, పలు శాఖల అధికారులతో సమీక్ష సమావేశాలను నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ కొన్ని రాజకీయ పార్టీలు మాత్రమే బీఎల్ఏల జాబితాను ఇచ్చాయని, ఇంకా కొన్ని పార్టీలు ఇవ్వలేదన్నారు. క్షేత్రస్థాయిలో ఓటర్ల జాబితా సర్వే పారదర్శకంగా జరగాలంటే బీఎల్‌ఏల నియామకం తప్పనిసరి అన్నారు. క్షేత్రస్థాయిలో బీఎల్‌ఓలతో పాటు ఆయా రాజకీయపార్టీలు సూచించిన బీఎల్‌ఏలు మాత్రమే వెళ్లాలని చెప్పారు. ఓటర్ల సర్వే ప్రక్రియ దేశవ్యాప్తంగా ఈ నెల 21 వరకు జరుగుతున్నందున పలు చోట్ల సాంకేతిక సమస్యలు వస్తున్నట్లు చెప్పారు. ఆ సమస్యల పరిష్కారం కాకుంటే మాన్యువల్‌గా పరిశీలన చేస్తామన్నారు. సమావేశంలో డీఆర్‌ఓ రాజశేఖర్, వైఎస్సార్‌సీపీ, సీపీఎం, సీపీఐ, కాంగ్రెస్ పార్టీలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు.

పకడ్బందీగా చేపట్టండి

జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్న ఓటర్ల జాబితా ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలని జేసీ శ్రీనివాసులు అన్నారు. జిల్లా స్థాయి అధికారులతో పలు అంశాలపై బుధవారం ఆయన సమీక్ష నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ ఓటరు జాబితా తయారీ కసరత్తులో అలసత్వం ఉండకూడదన్నారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ కార్యక్రమం ఆగస్టు 15తో ముగియనున్నట్లు చెప్పారు. ఈ నెల 10 లోపు గ్రామ సచివాలయాల వద్ద 75 మొక్కలు నాటి, ఆ గ్రామ చరిత్రను తెలిపేలా శిలాఫలకం ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. జగనన్న పాలవెల్లువ కార్యక్రమంలో శాంతిపురం, రామకుప్పం, వి.కోట మండలాల్లో రిజిస్ట్రేషన్‌లను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. పాడి పశువులను కొనుగోలు చేయడంతో ఆర్థిక అభివృద్ధి జరుగుతుందన్నారు. ఆడుదాం ఆంధ్ర కార్యక్రమానికి సచివాలయాల పరిధిలో క్రీడలకు సరిపోయేంత మైదానాలు ఉన్నాయా..లేవా అనే నివేదికలు వెంటనే పంపాలని చెప్పారు. శాశ్వతంగా భూ తగాదాలను పరిష్కరించేందుకు ప్రభుత్వం చేపడుతున్న స్వామిత్వా కార్యక్రమం వేగవంతంగా చేపట్టాలన్నారు. ఈ సమీక్షలో జెడ్పీ సీఈవో ప్రభాకర్‌రెడ్డి, డ్వామా పీడీ గంగాభవాని డీఆర్‌డీఏ పీడీ తులసి, ఐసీడీఎస్ పీడీ నాగశైలజ, డీపీవో లక్ష్మీ, హౌసింగ్ పీడీ పద్మనాభం, ఇతర శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్ అడ్మిషన్లపై అవగాహన కల్పించండి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న డీఈవో విజయేంద్రరావు, ఏపీసీ వెంకటరమణారెడ్డి

చిత్తూరు కలెక్టరేట్ : ఓపెన్ స్కూల్ అడ్మిషన్లపై క్షేత్రస్థాయిలో విస్తృత అవగాహన కల్పించాలని డీఈవో విజయేంద్రరావు అన్నారు. స్థానిక డీఈవో కార్యాలయంలో బుధవారం స్టడీ సెంటర్ల కో-ఆర్డినేటర్లతో సమావేశం నిర్వహించారు. డీఈవో మాట్లాడుతూ 2023-24 విద్యాసంవత్సరం అడ్మిషన్ల విధి విధానాలను తెలుసుకోవాలన్నారు. గత విద్యాసంవత్సరం కంటే ప్రస్తుతం అడ్మిషన్లను పెంచేందుకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని చెప్పారు. నిబంధనల మేరకు అడ్మిషన్లు పూర్తి చేయాలని సూచించారు. 'చదువు మళ్లీ కొనసాగిద్దాం...బంగారు భవితను నిర్మించుకుందాం' అనే నినాదంతో రాష్ట్ర ప్రభుత్వం ఓపెన్ స్కూల్ దూర విద్యావిధానం అమలు చేస్తోందన్నారు. పదవ తరగతి, ఇంటర్ కోర్సులు చదివేందుకు అవకాశం ఉంటుందని చెప్పారు. జిల్లాలోని గ్రామ, వార్డు సచివాలయాల్లో అడ్మిషన్‌లు చేసుకునేందుకు అవకాశం ఉన్నట్లు తెలిపారు. ఏపీ ఓపెన్ స్కూల్ అందజేసే సర్టిఫికెట్లు 2023 విద్యాసంవత్సరం నుంచి డిజీ లాకర్ విధానంలో అందుబాటులో ఉంటాయన్నారు. సెలవు దినాల్లో మాత్రమే తరగతులు నిర్వహించనున్నట్లు చెప్పారు. అడ్మిషన్‌లు పొందేవారికి జ్ఞానధార యూట్యూబ్ చానల్ లో ఈ కంటెంట్ అందిస్తారన్నారు. ఈ నెల 31వ తేదీ లోపు ఎలాంటి అపరాధ రుసుం లేకుండా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. జిల్లా స్టడీ సెంటర్లు ప్రభుత్వ నిబంధనలు పాటించకపోతే సీజ్ చేస్తామని హెచ్చరించారు. సమగ్రశిక్ష ఏపీసీ వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ గత మూడేళ్లలో పదవ తరగతి, ఇంటర్మీడియట్ ఫెయిల్ అయిన విద్యార్థులు, బడిబయట పిల్లలకు అవగాహన కల్పించాలన్నారు. డీవైఈవో చంద్రశేఖర్ మాట్లాడుతూ విద్యార్థుల నుంచి ప్రభుత్వం నిర్ణయించిన ఫీజులకంటే అధికంగా వసూళ్లు చేస్తే కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు. జిల్లా ఓపెన్ స్కూల్ కో-ఆర్డినేటర్ గురుస్వామిరెడ్డి మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల సహకారంతో అడ్మిషన్ల పెంపునకు చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం అడ్మిషన్ల పోస్టర్లను ఆవిష్కరించారు. డీఈవో కార్యాలయం నుంచి గాంధీ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో స్టడీ సెంటర్ల కో ఆర్డినేటర్‌లు పాల్గొన్నారు.

ఎం-పరివాహన్ సేవలు వినియోగించుకోండి

చిత్తూరు రూరల్: రవాణాశాఖకు సంబంధించిన సేవలను రాష్ట్ర ప్రభుత్వం ఎం-పరివాహన్, డిజీ లాకర్ యాప్‌ల ద్వారా అందుబాటులోకి తీసుకొచ్చింది. డ్రైవింగ్ లైసెన్సు(డీఎల్), వాహనాల ఆర్సీ కార్డులను కూడా డిజిటల్ విధానంలోకి తీసుకొచ్చింది. లైసెన్సులు, ఆర్సీలకు సంబంధించి కార్డులు లేక ఇతర రాష్ట్రాలతోపాటు ఏపీలో పోలీసులు జరిమానా విధిస్తున్నారంటూ 'జగనన్నకు చెబుదాం'కు ఫిర్యాదులు వెళ్లాయి. దీంతో రాష్ట్ర ప్రభుత్వం ఎం పరివాహన్ యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకుని, అందులో నుంచి డిజిటల్ కార్డులను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపింది. రవాణా, పోలీసు అధికారుల తనిఖీల సమయంలో ఈ యాప్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకున్న లైసెన్సులు, ఆర్సీలను చూపించవచ్చని స్పష్టం చేసింది. ఇప్పటి వరకు తీసుకున్న లైసెన్సులు, ఆర్సీలకు సంబంధించి కార్డులను త్వరలో అందజేయనున్నట్లు రవాణా అధికారులు చెబుతున్నారు. గతంలో లైసెన్స్, ఆర్సీకి కార్డు, పోస్టల్ చార్జీలకు రూ.325కు పైగా ప్రభుత్వానికి చలానా రూపంలో చెల్లించాల్సి ఉండేది. అయితే వాహనదారులపై ఈ భారం పడకుండా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఎం-పరివాహన్ యాప్ అందుబాటులోకి వచ్చిన నేపథ్యంలో కార్డు కోసం డబ్బులు చెల్లించాల్సిన అవసరం లేదు. ఇప్పటి నుంచి ఎం పరివాహన్ యాప్‌లోనే లైసెన్స్‌లు ఆర్సీలు అందుబాటులో ఉంటాయి. ఈ విషయాన్ని వాహనదారులు గమనించాలని రవాణా అధికారులు కోరుతున్నారు. అదే విధంగా ఇప్పటికే డిజీ లాకర్ యాప్‌లో వ్యక్తిగత మైన సర్టిఫికెట్లను కూడా రాష్ట్ర ప్రభుత్వమే అప్‌లోడ్ చేస్తోంది.

వాస్తవాలను చాటే వీడియోల పోటీలు



కరపత్రాలను విడుదల చేస్తున్న ఎమ్మెల్సీ భరత్, నాయకులు

శాంతిపురం: కుప్పం వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా 'నిజం నిర్భయంగా' పేరుతో నిర్వహిస్తున్న వీడియో పోటీల కరపత్రాలను ఎమ్మెల్సీ భరత్ బుధవారం విడుదల చేశారు. ప్రతిభను ప్రోత్సహించేందుకు, వాస్తవాలను జనం ముందుకు తెచ్చేందుకు ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆయన చెప్పారు. మొత్తం మూడు విభాగాల్లో ఈ నెల 31 వరకూ జరిగే పోటీల విజేతలకు వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా సెప్టెంబర్ 2న బహుమతులు అందిస్తామన్నారు. 'నవరత్న కాంతులు' విభాగంలో నవరత్నాలపై 15 నిమిషాల్లోపు షార్ట్ ఫిలిం పోటీలో ఉత్తమ వీడియోకు రూ.50 వేలు, 5 ప్రోత్సాహక బహుమతులు ఉంటాయన్నారు. 'జగనన్నే చేశాడు' విభాగంలో జగనన్న పాలనలో పరిష్కారమైన దీర్ఘకాలిక సమస్యలపై 15 నిమిషాల్లోపు డాక్యుమెంటరీ పోటీలో ఉత్తమ వీడియోకు రూ.50 వేలు, 5 ప్రోత్సాహక బహుమతులు ఉంటాయన్నారు. వీటికి తోడుగా ప్రతి వారం 'సత్యమేవ జయతే' విభాగంలో నిర్దేశిత సంక్షేమ, అభివృద్ధి పథకాలపై 5 నిమిషాల నిడివితో షార్ట్ వీడియోల పోటీలు జరుగుతాయన్నారు. ఉత్తమ షార్ట్ వీడియోలకు ప్రతి వారం రూ.5 వేలు, రూ.3 వేలు, రూ.2 వేలు బహుమతిగా అందిస్తామన్నారు. అన్ని అంశాల్లో పోటీల విజేతలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసే అవకాశంతో పాటు పాల్గొన్న అందరికీ ప్రత్యేక టీషర్టులు అందిస్తామని ఎమ్మెల్సీ చెప్పారు. ఈ కార్యక్రమంలో సోషల్ మీడియా నియోజకవర్గ ఇన్‌చార్జిలు రజనీకాంత్, మురుగేష్, శాంతిపురం, కుప్పం మండల పార్టీల కన్వీనర్లు బుల్లెట్‌దండపాణి, హెచ్‌ఎం మురుగేష్ నాయకులు కోదండరెడ్డి, శ్రీనివాసులు, చక్రపాణిరెడ్డి, అశ్వత్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాకు చేరిన ట్రాన్స్‌ఫార్మర్లు

చిత్తూరు కార్పొరేషన్ : ఉమ్మడి చిత్తూరు జిల్లాకు ట్రాన్స్‌ఫార్మర్‌లు వచ్చాయని ట్రాన్స్‌కో టెక్నికల్ ఈఈ సుబ్బారావ్ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 16కేవీ సామర్థ్యం ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లు 40, 315 సామర్థ్యం ఉన్నవి 4, 63 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లు 21 వచ్చాయని వెల్లడించారు. సంబంధిత ఏఈలు వర్క్‌ఆర్డర్‌లు పెట్టి మెటీరియల్‌ను డ్రా చేసుకోవాలని సూచించారు.


క్లుప్తంగా

మామిడిలో ఏటా ఫలసాయం


మాట్లాడుతున్న డీహెచ్‌వో మధుసూదన్ రెడ్డి

పలమనేరు: రైతులు తమ సూచనలను పాటిస్తే ఏటా మామిడిలో ఫలసాయాన్ని పొందవచ్చని జిల్లా ఉద్యాన అధికారి మధుసూదన్ రెడ్డి పేర్కొన్నారు. పలమనేరు ఆర్‌డీవో కార్యాలయంలో పలమనేరు, కుప్పం నియోజకవర్గాల ఆర్‌బీకే సిబ్బందితో మామిడి కోతల అనంతరం యాజమాన్య పద్ధతులపై అవగాహన కార్యక్రమం బుధవారం నిర్వహించారు. మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ మామిడి కోతల అనంతరం రైతులు చేసే సస్యరక్షణపైనే దిగుబడి ఆధారపడి ఉంటుందన్నారు. మామిడిలో ఖర్చులు తగ్గిస్తూ పంట దిగుబడులు ఎలా పెంచుకోవాలో తెలుసుకోవాలని చెప్పారు. సాధారణంగా మామిడిలో ఓ సారి దిగుబడి వస్తే మళ్లీ వచ్చే ఏడాది దిగుబడి రాదని గుర్తుచేశారు. అయితే ఏటా దిగుబడి రావాలంటే మామిడి తోటల్లో చెట్ల మొదళ్ల వద్ద గునపంతో మూడు అడుగులు గుంతను తవ్వి అందులో చెట్టుకు పది గ్రామలు సింజెంటా కంపెనీకి చెందిన మందును ఆగస్టు 15వ తేదీ లోపు వేసుకోవాలని సూచించారు. దీని విలువ మార్కెట్‌లో లీటర్ బాటిల్ రూ.3 వేలుగా ఉంటుందని దీంతో వంద చెట్లకు మందును వేసుకోవచ్చని సూచించారు. దీంతోపాటు తోటల్లో జనుము, జీనుగ లాంటి పచ్చరొట్ట ఎరువులను పెంచి కలియదున్నాలన్నారు. మామిడి తోటల్లో వాలుకు అడ్డం రెండు సాళ్లు దున్నితే సరిపోతుందని వివరించారు. ఈ విషయాలను ఆర్‌బీకే సిబ్బంది సంబంధిత గ్రామాల్లోని మామిడి రైతులకు తెలియజెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో పలమనేరు, కుప్పం ఉద్యానవన శాఖాధికారులు లక్ష్మీప్రసూన, డింపుల్, స్థానిక ఏడీ అన్నపూర్ణదేవితోపాటు రెండు నియోజకవర్గాలకు చెందిన హార్టికల్చర్, అగ్రికల్చర్ సహాయకులు పాల్గొన్నారు.

ప్రగతి పరుగులు



శ్రీసిటీలో పారిశ్రామిక ప్రగతి పరుగులు తీస్తోంది. రెండో విడత విస్తరణ పనులు వేగవంతం కావడంతో మరింతగా అభివృద్ధి చెందనుంది. ఇప్పటికే ప్రభుత్వం పలు పరిశ్రమల స్థాపనకు భూములు కేటాయించింది. అందులో కొన్ని కంపెనీల నిర్మాణం సైతం ప్రారంభమైంది. తొలి దశ సెజ్‌కు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి అంకురార్పణ చేశారు. మలి దశకు ఆయన తనయుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుడుతున్నారు. ఇద్దరు నేతల సంకల్ప బలంతో వెనకబడిన ప్రాంతమైన సత్యవేడు నియోజకవర్గం రూపురేఖలు మారిపోయాయి. గ్రామీణుల జీవనప్రమాణాలు మెరుగుపడ్డాయి. రెండో విడత పనులు పూర్తయితే యువతకు భారీ సంఖ్యలో ఉద్యోగ.. ఉపాధి అవకాశాలు లభించనున్నాయి.

వరదయ్యపాళెం : ప్రముఖ పారిశ్రామికవాడగా అభివృద్ధి చెందుతున్న శ్రీసిటీలో రెండవ విడత పనులు ఊపందుకున్నాయి. పెద్ద సంఖ్యలో పరిశ్రమల ఏర్పాటు దిశగా రోడ్లు, మౌలిక వసతుల కల్పన, నిర్మాణ పనులు వేగవంతంగా సాగుతున్నాయి. ఇప్పటికే కొన్ని పరిశ్రమలు నిర్మాణ పనులను మొదలు పెట్టాయి. మరికొన్ని పరిశ్రమలకు స్థలాల కేటాయింపులు పూర్తయ్యాయి. రెండో దశ పనులు ప్రారంభం కావడంతో ఆ ప్రాంత గ్రామాల రూపురేఖలు సైతం మారనున్నాయి.


శ్రీసిటీలో ఏర్పాటుకానున్న చైనాకు చెందిన సీఆర్‌ఆర్‌సీ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్

2,200 ఎకరాల్లో పనులు

సత్యవేడు మండలం ఇరుగుళం, కొల్లడం, పెద్దఈటిపాకం, వరదయ్యపాళెం మండలం తొండూరు గ్రామ పంచాయతీల పరిధిలోని 2,200 ఎకరాల్లో శ్రీసిటీని విస్తరించనున్నారు. ఈ మేరకు రెండో దశలో పరిశ్రమలు ఏర్పాటుచేయనున్నారు. ఇప్పటికే భూసేకరణ ప్రక్రియను సైతం పూర్తి చేశారు. ఇరుగుళం సమీపంలో పెద్దఈటిపాకం, కొల్లడం గ్రామాల మధ్య పారిశ్రామికవాడకు సంబంధించిన మౌలిక వసతులను శరవేగంగా కల్పిస్తున్నారు.

నిర్మాణ దశలో పలు పరిశ్రమలు

శ్రీసిటీ పరిధిలోని రెండో దశ పారిశ్రామికవాడలో ఓజీ ఇండియా ప్యాకింగ్, చైనాకు చెందిన సీఆర్ఆర్‌సీ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమలు నిర్మాణ దశలో ఉన్నాయి. మరికొన్ని పరిశ్రమలకు ఎంఓయూ సైతం పూర్తయ్యాయి. పక్కాగా మౌలిక వసతులు, ట్రాన్స్‌పోర్టుతోపాటు ప్రభుత్వం ప్రోత్సాహం ఉండడంతో శ్రీసిటీలో పెట్టుబడులు పెట్టేందుకు పలువురు పారిశ్రామికవేత్తలు ఆసక్తి చూపుతున్నారు.

తొలి దశకు వైఎస్సార్



అప్పట్లో శ్రీసిటీలో మొదటి దశ పనులకు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి బీజం వేశారు. రాష్ట్రంలో అత్యంత వెనుకబడిన ప్రాంతంగా ఉన్న సత్యవేడు నియోజకవర్గంలో పారిశ్రామికవాడకు పురుడు పోశారు. సుమారు 8వేల ఎకరాల్లో 08.08.2008వ తేదీన తొలుత 8 పరిశ్రమలకు అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పునాదిరాయి వేశారు. అప్పటి నుంచి దినదినాభివృద్ధి చెందిన శ్రీసిటీ అంతర్జాతీయ స్థాయికి చేరింది. 15ఏళ్లలో రూ. 45వేల కోట్లకు పైగా పెట్టుబడులతో 28 దేశాలకు చెందిన 200 పరిశ్రమలకు నిలయంగా మారింది. దాదాపు 50 వేలకు పైగా నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు అందించింది. దేశంలోని అత్యున్నత పారిశ్రామికవాడలో ఒకటిగా ప్రసిద్ధి చెందింది.

మలి దశకు సీఎం వైఎస్ జగన్



శ్రీసిటీ పారిశ్రామికవాడలోని రెండో దశకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారు. ఈ క్రమంలో పరిశ్రమ ఏర్పాటు సంబంధించిన అనుమతులకు పూర్తిగా సహకారం అందిస్తున్నారు. శరవేగంగా అభివృద్ధి పనులు సాగుతుండడంతో భూములు అందించిన ఇరుగుళం, పెద్దఈటిపాకం, కొల్లడం, తొండూరు పంచాయతీల ప్రజలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు.


శ్రీసిటీ రెండో దశ పారిశ్రామికవాడలో నూతనంగా ఏర్పాటు చేసిన రోడ్లు


నిర్మాణ దశలో ఉన్న ఓజీ ఇండియా ప్యాకేజింగ్ పరిశ్రమ


శ్రీసిటీ రెండో దశ పారిశ్రామికవాడలో ఏర్పాటైన కాంక్రీటు మిక్సింగ్ ప్లాంట్


నిర్మాణంలో ఉన్న పరిశ్రమలు


చిత్తూరు బులియన్

బంగారం :	
24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.60,000
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,460
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.76,000
రిటైల్ వెండి గ్రాము	రూ.79.00

బాలిక అనుమానాస్పద మృతి


మృతి చెందిన శాంతి

శాంతిపురం: 64 పెద్దూరు పంచాయతీ సోమాపురంలో 14 ఏళ్ల బాలిక అనుమానాస్పదస్థితిలో మృతి చెందింది. రాళ్లబూదుగూరు ఎస్ఐ మునస్వామి కథనం.. గ్రామానికి చెందిన బాలక్రిష్ణ కుమార్తె శాంతి (14) బుధవారం సాయంత్రం గ్రామ శివార్లలో ఉరికి వేలాడుతూ కనిపించింది. తన కుమార్తెపై అత్యాచారం చేసి హత మార్చారని మృతురాలి తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసిన పోలీసులు మృతదేహాన్ని కుప్పం పీఈఎస్ ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం నివేదిక ఆధారంగా కేసు దర్యాప్తు చేస్తామని ఎస్ఐ చెప్పారు.

రైలుకింద పడి యువకుడి ఆత్మహత్య

పాకాల:మండలంలోని ముద్దలపల్లె సమీపంలో బుధవారం రైలు కింద పడి ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాలు.. పాకాలలో ని ధర్మరాజులగుడివీధికి చెందిన మణిమారన్ (24) కోయంబత్తూరు నుంచి తిరుపతికి వస్తున్న రైలు కింద పడి బలవన్మరణం చెందాడు. రైల్వే పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. యువకుడి ఆత్మహత్యకు గల కారణాలు విచారణలో తెలియాల్సి ఉందని రైల్వే ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.



దివ్యాంగులకు ఆత్మస్థైర్యం అవసరం


పోటీలు పర్యవేక్షిస్తున్న డీఈవో విజయేంద్రరావు, ఏపీసీ వెంకటరమణారెడ్డి

చిత్తూరు కలెక్టరేట్ : దివ్యాంగులు మరింత ఆత్మస్థైర్యాన్ని పెంచుకోవాల్సిన అవసరం ఉందని డీఈవో విజయేంద్రరావు, సమగ్రశిక్ష శాఖ ఏపీసీ వెంకటరమణారెడ్డి పిలుపునిచ్చారు. సమగ్ర శిక్ష శాఖ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక కణ్ణన్ ప్రభుత్వ పాఠశాలలో దివ్యాంగులకు జిల్లా స్థాయి క్రీడాపోటీలు నిర్వహించారు. ఈ పోటీలను ప్రారంభించిన అనంతరం డీఈవో మాట్లాడుతూ ప్రతిభకు వైకల్యం అడ్డుకారాదన్నారు. పుట్టుకతో వచ్చిన లోపం శాపం కాదన్నారు. అధైర్య పడకుండా జీవితంలో ముందుకు సాగాలని సూచించారు. ఏపీసీ మాట్లాడుతూ దివ్యాంగులకు రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడుతున్నామన్నారు. అనంతరం వివిధ మండలాల నుంచి విచ్చేసిన దివ్యాంగ విద్యార్థులకు రన్నింగ్‌రేస్, షాట్‌పుట్, సాఫ్ట్‌బాల్, జావిలిన్‌త్రో పోటీలను నిర్వహించారు. అందులో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో డీవైఈవో చంద్రశేఖర్, ఐఈ కో-ఆర్డినేటర్ ప్రభాకర్‌వర్మ, పలు ప్రాంతాలకు చెందిన దివ్యాంగ విద్యార్థులు పాల్గొన్నారు.

వృద్ధురాలి హత్య కేసులో నిందితుడి అరెస్టు

- ఫైనాన్స్ ఇవ్వలేదని గొంతు కోసి హత్య చేసిన వైనం
- ఒక్క క్లూ కూడా దొరకని కేసును ఛేదించిన పోలీసులు



నిందితుడిని అరెస్టు చూపించి వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ, డీఎస్పీ తదితరులు

చిత్తూరు అర్బన్: జిల్లాలో గతనెల 11వ తేదీ జరిగిన అనసూయమ్మ (75) హత్య కేసులో నిందితుడు సిఎస్.జశ్వంత్ నాయుడు (35)ను తవణంపల్లె పోలీసులు పట్టుకున్నారు. ఈ మేరకు బుధవారం చిత్తూరులోని పోలీసు అతిథిగృహంలో ఏఎస్పీ సుధాకర్, చిత్తూరు డీఎస్పీ శ్రీనివాసమూర్తి నిందితుడు జశ్వంత్‌ను మీడియా ఎదుట అరెస్టు చూపించి వివరాలను వెల్లడించారు. తవణంపల్లె మండలం ఎగువ మారేడుపల్లెలో అమ్మదరూరు అనసూయమ్మ ఒంటరిగా జీవిస్తూ, చుట్టుపక్కల వాళ్లకు వడ్డీకు డబ్బులు ఇచ్చేది. ఈ క్రమంలో శంకర్‌నాయుడు, మాధవి దంపతుల కుమారుడు జశ్వంత్ బెంగళూరులో స్థిపరడి, తన అమ్మమ్మ గ్రామమైన ఎగువ మారేడుపల్లెకు అపుడపుడు వచ్చి వెళుతుండేవాడు. జల్సాలకు అలవాటుపడ్డ నిందితుడు అనసూయమ్మ గురించి తెలుసుకుని ఓ రోజు తనకు వడ్డీకు రూ.20 వేలు కావాలని అడగడంతో ఆమె నిరాకరించింది. అప్పుడు అక్కడి నుంచి వెళ్లిపోయాడు. అప్పటి నుంచి అనసూయమ్మ వద్ద పెద్ద మొత్తంలో డబ్బులు ఉందని భావించిన యశ్వంత్ ఆమెను హత్య చేయడానికి ప్రణాళిక రూపొందించుకున్నాడు. ఆన్‌లైన్‌లో ఓ చాకును కొనుగోలుచేసి గతనెల 11వ తేదీ రాత్రి అనసూయమ్మ ఇంటికి వచ్చి డబ్బుల కోసం ఆమెను కొట్టాడు. కేకలు వేయడంతో లోపలకు లాక్కెళ్లి చాకుతో గొంతుపై, చేతిపై పొడిచి నోట్లో పాత గుడ్డలు కుక్కేశాడు. డబ్బుకోసం బీరువా, ఇలు వెతికితే ఎక్కడా ఏమీ దొరక్కపోవడంతో మృతురాలి శరీరంపై ఉన్న రెండు బంగారు గాజులు, బంగారు గొలుసు లాక్కుని పారిపోయాడు. మృతురాలి కుమార్తె వరలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. అయితే ఈ కేసులో పోలీసులకు ఒక్క క్లూ కూడా దొరకలేదు. పలువురు అనుమానితులను విచారించినా ఉపయోగంలేకపోయింది. అయితే సాంకేతిక ఆధారాలు, పరిజ్ఞానం ఆధారంగా హత్య చేసింది జశ్వంతేనని పోలీసులు గుర్తించి, అతడ్ని విచారించారు. తొలుత బుకాయించినా, ఆపై చేసిన హత్యను అంగీకరించి, ఉపయోగించిన కత్తిని కూడా చూపించాడు. నిందితుడు దోచుకెళ్లిన బంగారు ఆభరణాలు, హత్యకు ఉపయోగించిన కత్తి, ద్విచక్ర వాహనంను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కేసును ఛేదించడంలో ప్రతిభ చూపించిన చిత్తూరు పశ్చిమ సీఐ రవిశంకర్, తవణంపల్లె ఎస్ఐ సుధాకర్‌రెడ్డి, గుడిపాల ఎస్ఐ రాజశేఖర్, సిబ్బందిని ఏఎస్పీ అభినందించారు. సిబ్బందికి నగదు రివార్డు సైతం అందచేశారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Education

DIRECT FINAL YEAR

■ Last Chance: 10th, Inter, Direct Degree (Disc), BA, B.Com, B.Sc, BBA, BCA, BMLT, DMLT,B.Tech,Diploma,MA,M.Com,M.Sc, MBA,MCA.Regular/lateral entry.9381287629

ONE SITTING

■ Direct 10th, Inter one Sitting, B.A, B.Com,B.Sc, BBA, B.Tech,M.A, M.Com, M.Sc, MBA, MCA, Distance Education, Tirupati, 7416478396, 7416478395.

PARAMEDICAL

■ B.Sc Nursing,BPT& Paramedical Courses Available. DMLT, Anesthesia, Dialysis, Cardiology, Cathlab, Opthalmic. Any Inter Eligible, Tirupati, 7416478396, 7416478395.

Real Estate

LEASE/RENT

■ రేణిగుంట, ఒక్క్ పోస్ట్, శ్రీనివాస కాలేజ్ ఎదురుగా, 80ft రోడ్ 4 ఫ్లోర్స్, ప్రతి ఫ్లోర్ 4,000 sft పార్కింగ్ సౌకర్యం, కాలేజీలు, హాస్పిటల్స్, షాపింగ్ మాల్స్ అనుకూలం ✆ 9912032550, 9849268970

నాలుగులైన్ల ప్రకటనకు : రూ. 375/-
అదనపు లైనుకు : రూ . 90/-
Contact
9705444178
951602970

Services

బంగారం కొనబడును

■ బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలో తాకట్టులో ఉన్నది విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) (100% జెన్యూన్) ✆ 90009 92521

■ బంగారం బ్యాంకులలో, ఇతర సంస్థలలో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం అధిక ధరకు కొనబడును. స్పాట్ క్యాష్. సంప్ర॥ ✆ 99481 68555.

Wanted

■ వేమూరి మార్ట్ Pvt Ltd, చంద్రగిరి నందు పనిచేయుటకు Part Time /Full Time ఉత్సాహవంతులైన స్త్రీ / పురుషులు కావలెను. ✆ 9392991453.

■ Wanted Drivers-5, ATM Operators -5, Recon-3, Qul: 10th/12th/Degree, For WBS Pvt Ltd. To work at Tirupati, ✆ 8655952236, 7799150922.

■ SPSRజిల్లాలో Escortsట్రాక్టర్లు,ఇంప్లిమెంట్స్ మార్కెటింగ్ చేయుట కొరకు ఆయా మండలాలలో నివసించు అభ్యర్థులు కావలెను. మంచి జీతం +TA+DA+ఇన్సెంటివ్ కలదు. 8500354444.

■ తిరుపతి దగ్గరలోని తుకివాక, తిరుచానూరు పరిధియాలలో పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్, S.O, A.Oలు అనుభవం కలిగిన వారు కావలెను. మంచి జీతం. సంప్ర॥ 8985422255, 8500405004

■ మీ మొబైల్ ద్వారా మా కంపెనీ అడ్వర్టైజ్‌మెంట్ పంపుతూ వారం వారం అధిక ఆదాయం పొందండి. మీ అడ్రస్ వాట్సప్ చేయండి. వివరాలకు కాల్ చేయండి. 95736 33520, 90596 33520.

■ తిరుపతి గాదంకి టోల్ ప్లాజా వద్ద గల Coffee Express Outlet లో పనిచేయుటకు సర్వీస్ Boys & Girls కావలెను. 14 మంది కావలెను. జీతం: రూ.15,000ల వరకు ఇవ్వబడును. సంప్ర:9966149999.

■ ప్రముఖ సంస్థకు మాయొక్క మొబైల్ ద్వారా సమాచారం పంపుతూ వారం వారం అధిక ఆదాయం సంపాదించుకోండి. మీ అడ్రస్ వాట్సప్ చేయండి. 88854 86421.

■ WANTED Need Soft Skills & English Language Trainer, Qul: Degree, Exp:1year, Good Salary, Location: Tirupati. ✆ 8179895913

■ Institute నందు ఇంటర్ Maths బోధించుటకు అనుభవజ్ఞులైన Faculty కావలెను. Timings: Evening (7:15pm - 8.30pm), Place: S.N.Puram, Tirupati, సంప్ర: 9032185207

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి+భోజనం. జీతం: 18K. ఏజెంట్ కమీషన్ 3K. ఫోన్ : 9848571888

■ షిర్డీసాయి వృద్ధుల ఆశ్రమము, హైదరాబాద్‌లో పనిచేయుటకు లేడీవార్డెన్స్, ఆయాలు, వార్డ్ బాయ్స్, భార్యాభర్తలు డ్రైవర్స్ కావలెను. ఫోన్ : 9391086881, 9246585901

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారులు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

జిల్లా షూటింగ్ బాల్ జట్టు ఎంపిక


ఎంపికైన జిల్లా షూటింగ్ బాల్ జట్టు

రామకుప్పం: స్థానిక బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో 12 మందితో కూడిన జిల్లా షూటింగ్ బాల్ జట్టును ఎంపిక చేసినట్లు పాఠశాల ప్రిన్సిపల్ రాజేంద్ర తెలిపారు. షూటింగ్ బాల్ జిల్లా జట్టు ఎంపిక పోటీల్లో వివిధ మండలాల నుంచి సుమారు 50 మంది క్రీడాకారులు పాల్గొన్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ నెల 12, 13 తేదీల్లో నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డిపాలెంలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో ఎంపికైన నూతన జిల్లా జట్టు పాల్గొంటుందన్నారు. జిల్లా జట్టుకు క్రీడాకారులు మదన్, అనిల్, సందీప్, మహేష్, జయంత్, తిరుమలేష్, అరుణ్, చరణ్, సంతోష్, అబ్రాల్, మహేష్, నవీన్ ఎంపికైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీడీ వెంకట్రమణ రెడ్డి, పీఈటీలు ప్రతాప్,నవనీత పాల్గొన్నారు.

యువతి అదృశ్యంపై కేసు

నారాయణవనం: మండలంలోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంజినీరింగ్ చదువుతున్న యువతి(20) మంగళవారం అదృశ్యమైంది. విద్యార్థిని తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పరమేష్ నాయక్ తెలిపారు. ఆయన కథనం మేరకు.. గంగాధరనెల్లూరు మండలానికి చెందిన యువతి బీటెక్ తృతీయ సంవత్సరం చదువుతోంది. మంగళవారం కళాశాలకు వచ్చిన ఆమె తరగతికి హాజరు కాకపోవడంతో ఇంటికి సమాచారం ఇచ్చారు. సీసీ ఫుటేజీని పరిశీలించగా ఉదయం 9.45 గంటలకు యువతి ఆటోలో పుత్తూరు వైపు వెళ్లినట్లు గుర్తించారు. బంధువులు, స్నేహితులను విచారించినప్పటికీ ఆచూకీ దొరకలేదు. ఈ మేరకు యువతి అదృశ్యంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అంతర్రాష్ట్ర దొంగ అరెస్ట్

- రూ.39,550 నగదు, బైక్ స్వాధీనం


నిందితుడి అరెస్ట్ చూపుతున్న పోలీసులు

తిరుపతి రూరల్: ఆలయాల్లో చోరీలకు పాల్పడిన అంతర్రాష్ట్ర దొంగను అరెస్టు చేసి రూ.39,550 నగదు, మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నట్టు రూరల్ సీఐ సుబ్రమణ్యం రెడ్డి, ఎస్ఐ వినోద్‌కుమార్ తెలిపారు. బుధవారం వారు మాట్లాడుతూ తమిళనాడులోని నాగర్‌కోయిల్ జిల్లా కన్యాకుమారికి చెందిన ఉమేష్ ధీరజ్, ఆయన తండ్రి ఉమేష్ పలు ఆలయాల్లో చోరీలకు పాల్పడినట్లు వెల్లడించారు. అందులో భాగంగా జూలై 11వ తేదీ అర్ధరాత్రి తిరుపతి రూరల్ మండలం కొత్త చెర్లోపల్లెలోని ఆంజనేయస్వామి ఆలయంలో చోరీ చేసినట్లు చెప్పారు. హుండీని పగలకొట్టి రూ.57 వేల నగదు, సీసీ కెమెరాలకు సంబంధించిన డీవీఆర్ బాక్స్‌ను అపహరించినట్లు వివరించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టగా బుధవారం కాలూరు క్రాస్ వద్ద ఉమేష్ ధీరజ్ పట్టుబడినట్లు వెల్లడించారు. మరో నిందితుడు ఉమేష్ పరారీలో ఉన్నట్లు తెలిపారు. నిందితుడిని పట్టుకున్న ఎస్ఐ వినోద్‌కుమార్, సిబ్బందిని ఎస్పీ పరమేశ్వరరెడ్డి అభినందించారు.

అప్పుడే నూరేళ్లు నిండాయా ‘నవీనా’!


కొడుకు మృతదేహం వద్ద రోదిస్తున్న తండ్రి చిట్టిబాబు


రాస్తారోకోతో నిలిచిపోయిన వాహనాలు (ఇన్‌సెట్) నవీన్ (ఫైల్)

- కారు ఢీకొని విద్యార్థి దుర్మరణం
- మిన్నంటిన తండ్రి రోదన
- వడమాలపేట వద్ద ఘోరం

పుత్తూరు రూరల్: ఇంటికి వస్తువులు తీసుకొని ద్విచక్రవాహనంపై బయల్దేరిన విద్యార్థిని కారు రూపంలో మృత్యువు కబళించింది. వడమాలపేట బైపాస్ రోడ్డులోని పాదిరేడు సర్కిల్ వద్ద బుధవారం సాయంత్రం ఈ దుర్ఘటన చోటుచేసుకొంది. పోలీసుల కథనం మేరకు, వడమాలపేట మండలం పాదిరేడు ఎస్సీ కాలనీకి చెందిన తడుకు నవీన్(21) వడమాలపేట నుంచి ఇంటికి ద్విచక్రవాహనంపై బయల్దేరాడు. చెన్నై నుంచి తిరుపతి వైపు వెళుతున్న ఇనోవా కారు వేగంగా ఢీకొనడంతో నవీన్ అక్కడికక్కడే మృతి చెందాడు. కారులోని వ్యక్తులు భయపడి సంఘటనా స్థలంలోనే కారును వదలిపెట్టి పరారయ్యారు. విషయం తెలుసుకొన్న నవీన్ తండ్రి చిట్టిబాబు సంఘటనా స్థలానికి చేరుకొని కొడుకు మృతదేహాన్ని చేతిలోకి తీసుకొని అప్పుడే నూరేళ్లు నిండాయా నవీనా అంటూ గుండెలవిసేలా రోదించారు. మృతుడు పుత్తూరు ప్రభుత్వ కళాశాలలో డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు.

ఆగ్రహించిన గ్రామస్తులు–ఆగిన వాహనాలు

పాదిరేడు బైపాస్‌గా పిలుస్తున్న సంఘటనా స్థలంలో ఎప్పటి నుంచో స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేయాలని పలు గ్రామాల ప్రజలు అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు. అయినా అధికారులు పట్టించుకోకపోవడం వల్లే మరో ఘోరం జరిగిందని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తిరుపతి–చెన్నై జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. దీంతో రెండు కిలోమీటర్ల మేర వాహనాలు బారులు తీరి నిలిచిపోయాయి. పుత్తూరు రూరల్ సీఐ సురేష్‌కుమార్ ఆందోళన కారులతో చర్చించి, పాదిరేడు సర్కిల్ వద్ద స్పీడ్ బ్రేకర్స్ ఏర్పాటు చేయిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పుత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.